# సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 7 । నవంబర్ । 2023






**'పట్నం'లో టైట్ ఫైట్**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఈసారి పోరు హోరాహోరీగా సాగనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 10లో▸



**సబిత.. మంత్రిగా ఘనత**

చేవెళ్ల చెల్లెమ్మగా.. తొలి మహిళా హోంమంత్రిగా.. గెలిచిన ప్రతీసారి మంత్రి పదవి చేపట్టి సబిత ప్రత్యేకత చాటుతున్నారు. 10లో▸

**నేడు ఆ పార్కుల మూసివేత**

లక్డీకాపూల్: ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకు నగరానికి రానున్న దృష్ట్యా మంగళవారం ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కులను మూసివేయనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు హెచ్ఎండీఏ ఈ నిర్ణయం తీసుకుంది.

## న్యూస్‌రీల్

### ప్రజా పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం

**పౌరసరఫరాల శాఖ డీటీ రఘునందన్**



రేషన్ బియ్యం రవాణా లారీని తనిఖీ చేస్తున్న రఘునందన్

**ఆమనగల్లు:** గిడ్డంగి నుంచి చౌక దుకాణాలకు రేషన్ చేరవేసే రవాణాలో పారదర్శకతకు ప్రథమ ప్రాధాన్యం అని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. ఆమనగల్లు జాతీయ రహదారిపై సోమవారం ఆయన రేషన్ రవాణా లారీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోడౌన్ నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం చేరవేసే లారీలు జీపీఎస్ సాంకేతికతతో అనుసంధానం చేయబడి ఉంటాయన్నారు. ఆయా లారీల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్నారు. కాంట్రాక్టర్లు కూడా అనుమతించిన వాహనాలను మాత్రమే రవాణాకు ఉపయోగించాలన్న నిబంధన ఉందన్నారు. చౌక దుకాణాలకు ప్రజా పంపిణీ బియ్యం సకాలంలో చేరేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

### 239 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు

**ఎన్నికల శిక్షణ తరగతులకు గైర్హాజరుపై కలెక్టర్ సీరియస్**

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** విధి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కన్నెర్ర చేశారు. ఓటర్ల జాబితాలో తప్పిదాలకు కారణమైన శేరిలింగంపల్లి బీఎల్ఓ, సూపర్‌వైజర్లపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేయగా తాజాగా ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు గైర్హజరైన సుమారు 239 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా అక్టోబర్ 31న, నవంబర్ 2న జిల్లా కేంద్రంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అదర్ పోలింగ్ ఆఫీసర్లు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపిక చేసిన పీఓలు, ఏపీఓలకు ముందే సమాచారం ఇచ్చారు. కలెక్టరేట్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ తరగతులకు సుమారు 239 మంది పీఓ, ఏపీఓలు గైర్హజరవడాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి సీరియస్‌గా తీసుకున్నారు. శిక్షణ తరగతులకు ఎందుకు రాలేదో వివరించాలని కోరుతూ సోమవారం వారికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. పెద్ద సంఖ్యలో షోకాజ్ నోటీసులు జారీ చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వీరిలో 70 మంది ఉపాధ్యాయులు ఉండగా, ఇతర విభాగాల ఉద్యోగులు సైతం ఉండటం విశేషం.

### హైదరాబాద్- బీజాపూర్ రహదారికి గ్రీన్ సిగ్నల్




**చేవెళ్ల:** హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి అప్పా నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి ఎన్‌జీటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈరోడ్డు నిర్మాణానికి ఎదురైన అవరోధాలు ఇక తొలగినట్లే. సోమవారం జాతీయ హరిత ట్రిబ్యునల్ ఈ రోడ్డుపై జరిగిన వాదనల్లో దీనిపై వచ్చిన అభ్యంతరాలను తోసి పుచ్చి ఈరోడ్డు నిర్మాణాన్ని తలపెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకొని ఉండటంతో ఈ రోడ్డు నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేసేందుకు అవకాశం ఉంది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల దూరం రూ. 928.41కోట్ల వ్యయంతో నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. ఈ రోడ్డు విస్తరణ కోసం 350 ఎకరాల భూమిని సైతం సేకరించారు.రహదారి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే వాహనాలు నేరుగా జాతీయ రహదారికిపై రాకుండా అండర్‌పాస్ బ్రిడ్జిలను కూడా నిర్మించనుంది.మొత్తం ఆరు భారీ, ఎనిమిది చిన్న అండర్‌పాస్ బ్రిడ్జిలతో పాటు చేవెళ్ల, మొయినాబాద్ మండల కేంద్రాల్లో బైపాస్ రోడ్ల నిర్మాణాలు కూడా ప్రణాళికలో ఉన్నాయి. చిటెంపల్లి గేట్‌వద్ద 12 లేన్ల టోల్‌ప్లాజాను కూడా ఏర్పాటు చేయనుంది. ఈ రోడ్డు విస్తరణ పనులతో ఈరోడ్డుపై నిత్యం జరిగే ప్రమాదాల నివారణకు మోక్షం కలుగుతుందని ప్రజలు,వాహనదారులు పేర్కొంటున్నారు.

# అటు ⟷ ఇటు

**రోజుకో పార్టీ.. పూటకో కండువా**

- ఎడాపెడా మారుతున్న లీడర్లు
- ప్రధాన పార్టీల అభ్యర్థులకు తలపోటు
- ఎన్నికల చిత్రాలను చూసి విస్తుపోతున్న జనం



**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ దంపతులు సరిగ్గా 25 రోజుల క్రితం కారు దిగి.. హస్తం గూటికి చేరుకున్నారు. వారం రోజుల క్రితం కాంగ్రెస్‌ను వీడి మళ్లీ కారెక్కారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ అడాల గణేశ్ రెండు రోజుల క్రితం కారుదిగి హస్తం గూటికి చేరుకున్నారు. అనూహ్యంగా ఆ మరుసటిరోజే చేతికి చెయ్యిచ్చి.. మళ్లీ కారెక్కారు. మంచాల మండలం దళిత మోర్చా మండల అధ్యక్షుడు, తిప్పాయిగూడ సర్పంచ్ శివరాల పాండు ఐదు రోజుల క్రితం కమలాన్ని వీడి.. కారెక్కారు. అదే రోజు రాత్రి కారు దిగి మళ్లీ కమలం గూటికి చేరుకున్నారు. ఎన్నికల వేళ ఇలా అనేక మంది ఆశావహులు, ద్వితీయ శ్రేణి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీ కండువాలను మార్చేస్తున్నారు. ఉదయం ఒక పార్టీలో కన్పించిన వారు సాయంత్రం మరో పార్టీ కండువాతో కన్పిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. నిత్యం వెన్నంటి ఉండే కీలక అనుచరులే రాత్రికి రాత్రే చెప్పాపెట్టకుండా పార్టీ కండువాలు మారుస్తుండటంతో ప్రధాన పార్టీల తరఫున ఎన్నికల్లో బరిలోకి దిగిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఎవరిని నమ్మాలో.. నమ్మొద్దో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు.

**ఒక పార్టీ అసంతృప్తులకు.. మరో పార్టీ గాలం**

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం.. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను కూడా ఖరారు చేశాయి. నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. కీలకమైన ఈ తరుణంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి బరిలోకి దిగిన అభ్యర్థుల ముందు అనేక డిమాండ్లు వచ్చి పడుతున్నాయి. సాధారణ ఓటర్ల నుంచే కాదు.. టికెట్ ఆశించి భంగపడిన కీలక నాయకులు, పార్టీ మండల అధ్యక్షులు, స్థానిక సంస్థల సభ్యులు, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, బూత్ స్థాయి నాయకులు.. ఇలా అంతా కలిసి ఆయా అభ్యర్థుల ముందు అనేక డిమాండ్లు పెడుతున్నారు. అడిగినంత ముట్టజెప్పకపోయినా.. పని చేసి పెట్టకపోయినా.. ఆ మరుసటి రోజే వెళ్లి మరో పార్టీలో చేరిపోతున్నారు. లీడర్లలో ఉన్న ఈ బలహీనతను ప్రత్యర్థి పార్టీలు కూడా తమకు అనుకూలంగా మలచుకుంటున్నాయి. ఇలా ఒక పార్టీ అసంతృప్తులకు మరో పార్టీ గాలం వేస్తోంది. పార్టీలో చేరే వ్యక్తి హోదాను, ప్రభావితం చేసే ఓట్లను బట్టి ప్యాకేజీలు నిర్ణయిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఆశావహులకు అధికార బీఆర్ఎస్ పెద్ద మొత్తంలో నగదుతో పాటు ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులను ఎరగా చూపుతుంటే.. ప్రతిపక్ష కాంగ్రెస్, విపక్ష బీజేపీ సైతం అదే స్థాయిలో హామీలు ఇస్తున్నాయి. ఒకవైపు ఎవరికి వారు ప్రచారంలో దూసుకుపోతూనే మరోవైపు ప్రత్యర్థులను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఈ చేరికలకు తెరతీస్తుండటం విశేషం.

**నీడను కూడా నమ్మలేని పరిస్థితి**

నిన్న మొన్నటి వరకు వెన్నంటే ఉన్న నేతలు ఎవరికి టికెట్ వచ్చినా.. పార్టీ కోసం కలసికట్టుగా పని చేసుకుందామని చెప్పిన నేతలు తీరా టికెట్ దక్కక పోవడంతో ప్లేటు ఫిరాయిస్తున్నారు. పార్టీపై బహిరంగంగా అసంతృప్తిని వెల్లగక్కడంతో పాటు టికెట్ దక్కించుకున్న నేతలపై స్వయంగా ఫిర్యాదులు చేస్తున్నారు. మహేశ్వరం నుంచి కాంగ్రెస్ తరఫున టికెట్ ఆశించిన బడంగ్‌పేట మేయర్ పారిజాతకి తీరా టికెట్ దక్కక పోవడానికి ఆ పార్టీ నేతలు చేసిన అభ్యంతరాలే కారణమని తెలుస్తోంది. తాజాగా చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌కు బీఫాం అందజేయడంలో జరుగుతున్న జాప్యానికి సహచర నేతలే కారణమనే ప్రచారం జరుగుతోంది. రెండు మూడు నెలల క్రితం వరకు అంతా కలిసి పని చేసుకుందామని చెప్పిన నేతలు..తీరా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై..పార్టీలు అభ్యర్థుల పేర్లను ఖరారు చేసిన తర్వాత అడ్డం తిరుగుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు చివరికి తమ నీడను కూడా నమ్మలేని పరిస్థితికి వెళ్లిపోయారు. బస్తీ లీడర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు,కుల సంఘాలు, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు, వ్యాపారులు, ఆటో, భవన నిర్మాణ, పారిశ్రామికవాడల్లోని కార్మిక సంఘాలకు చెందిన కొంతమంది నేతలు ఒక్కోరోజు ఒక్కో పార్టీ కండువాతో కన్పిస్తుండటం కూడా అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తోంది. పదిమంది యువకులు కలిసి పార్టీ కండువా కప్పుకొంటే చాలు రూ. లక్షకుపైగా చెల్లించుకోవాల్సి వస్తోందని అభ్యర్థులు వాపోతున్నారు. ఎన్నికల సిత్రాలను చూసి సాధారణ జనం ఔరా అని విస్తుపోతున్నారు.



ఆమనగల్లు: కల్వకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి



ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి తరఫున ఆయన సతీమణి ముకుందమ్మ

# 18 మంది అభ్యర్థులు.. 19 నామినేషన్లు

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మూడో రోజైన సోమవారం జిల్లా వ్యాప్తంగా 18 మంది 19 నామినేషన్లు దాఖలు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దండెం రాంరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. మహేశ్వరం, చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. స్వతంత్ర అభ్యర్థి ముద్దగోని రాజ్యలక్ష్మి ఇబ్రహీంపట్నం నుంచి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, మిగిలిన అభ్యర్థులంతా ఒక్కో సెట్ చొప్పున దాఖలు చేశారు.

# గెలుపుగుర్రాలకే పార్టీ టికెట్లు

**షాద్‌నగర్‌రూరల్:** పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మద్దతుదారులను బీజేపీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో సోమవారం పార్టీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, నందిగామ మండల అధ్యక్షుడు సుధాకర్‌అప్ప, కొత్తూరు మండల ధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇస్నాతి శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల ప్రదీప్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అధిష్టానం గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చిందని, రాష్ట్రంలో బీజేపీ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. షాద్‌నగర్‌లో పార్టీ అభ్యర్థి అందె బాబయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, కమ్మరి భూపాలాచారి, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, ప్రణీత్‌రెడ్డి, చెట్ల వెంకటేశ్, నర్సింహగౌడ్, కుర్మ య్య, మఠం రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భారతి హోళికేరి తదితరులు

# ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భారతి హోళికేరి

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి చెప్పారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌హెచ్ అజయ్ బదూ, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె డీఆర్ఓ సంగీత, నోడల్ ఆఫీసర్లతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.116.11 కోట్ల విలువ చేసే నగదు సహా బంగారం సీజ్ చేసినట్లు చెప్పారు. ఇందులో రూ.32.03 కోట్ల నగదు ఉండగా, రూ.83.17 కోట్ల విలువ గల బంగారు ఆభరణాలు, రూ.90.23 కోట్ల ఫ్రీబీస్‌లను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. గ్రీవెన్స్ కమిటీకి సంబంధించి వచ్చిన కేసులను పరిశీలించి సరైన ఆధారాలుంటే వాటిని డిస్పోజ్ చేసినట్లు వివరించారు. ఆయా కేసుల్లో ఇన్ కమ్ ట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్, జీఎస్టీ వారికి సమాచారం అందించి కేసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇన్ కమ్ ట్యాక్స్, జీఎస్టీ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ తదితర బృందాలతో ఇప్పటికే ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో తనిఖీల సమయంలో రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు తదితరాలు లభించినట్లయితే ఇన్ కమ్ ట్యాక్స్ వారికి పంపిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా, పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వివరించారు.

# జన సమీకరణపైనే దృష్టి

- నేడు ఎల్‌బీ స్టేడియంలో బీజేపీ 'బీసీ ఆత్మగౌరవ' సభ
- హాజరు కానున్న ప్రధాని నరేంద్ర మోదీ
- సభ సక్సెస్‌కు బీజేపీ శ్రేణుల కసరత్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభకు సర్వం సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియం వేదికగా నిర్వహించనున్న ఈ సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేసేందుకు గ్రేటర్ నియోజకవర్గాల నుంచి భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు చేసింది. బూత్ ఇన్‌చార్జిలతో పాటు కార్యకర్తలను ఈ సభకు తరలించాలని నిర్ణయించింది. తెలంగాణలో మెజార్టీ అభ్యర్థులు విజయం సాధించి బీజేపీ అధికారంలోకి వస్తే..బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా నియమించనున్నట్లు ఈ సభావేదికగా ప్రధాని ప్రకటించే అవకాశం ఉంది. బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు బీసీలకు ఏం చేసింది? భవిష్యత్తులో వారికి ఏం చేయబోతోంది? వంటి అంశాలను ప్రధాని వివరించనున్నారు. బషీర్‌బాగ్ కేంద్రంలోని ఎల్బీ స్టేడియం వేదికగా బీసీ గర్జన సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు ఆ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆంక్షలు కొనసాగుతాయని ప్రకటించారు.

**ఆ సీట్లపై ఇంకా వీడని ఉత్కంఠ**

ఇదిలా ఉంటే బీజేపీ, కాంగ్రెస్‌లు దాదాపు అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయితే బీజేపీ మాత్రం కీలకమైన స్థానాలకు ఇప్పటికీ అభ్యర్థులను ఖరారు చేయకపోవడం పార్టీ శ్రేణులను ఆందోళనకు గురి చేస్తోంది. గ్రేటర్ పరిధిలోని శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, నాంపల్లి, కంటోన్మెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఆయా స్థానాలపై నెలకొన్న ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. జనసేనతో పొత్తు నేపథ్యంలో ఈ సీట్లను పెండింగ్‌లో పెట్టిన విషయం తెలిసింది. రెండు పార్టీల మధ్య ఇప్పటికే చర్చలు కొలిక్కి వచ్చినప్పటికీ..అభ్యర్థులను ఖరారు చేయలేదు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి అభ్యర్థిని ఖరారు చేసినప్పటికీ..ఆయన అనారోగ్య కారణాల రీత్యా పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు సమాచారం. ఆ స్థానంలో మరో అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. ఇది కూడా మంగళవారం మధ్యాహ్నం వరకు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

# ప్రతిపక్షాలపై విమర్శలు సరికాదు

**కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘు

**షాద్‌నగర్‌రూరల్:** ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం కాదు.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎన్ని అమలు చేశారో మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ గిరిజన విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా జిల్లాలకు వెళ్తున్న మంత్రి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్యవంటి హామీలు ఏమయ్యాయని, దళితబంధు దళితులందరికీ ఎందుకివ్వలేదని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమి భయంతోనే పట్టణంలో రెండోసారి మంత్రి కేటీఆర్ సభ నిర్వహించారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి కొత్తూరు మండలంలో పేదల భూములను లాక్కొని రైతులను భయభ్రాంతులకు గురిచేసిన నవీన్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, అలాంటి వ్యక్తి బీఆర్ఎస్‌లో కలిసినప్పుడే ఆ పార్టీ పతనం ఖాయమైందన్నారు. కాంగ్రెస్‌లో ఉంటూ బీఆర్ఎస్ కోవర్టుగా పని చేసిన కడెంపల్లి శ్రీనివాస్‌తో కాంగ్రెస్ పార్టీకి నష్టమేమీ లేదన్నారు. పార్టీకోసం పనిచేసే నాయకులను పార్టీ కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని అన్నారు. సమావేశంలో నాయకులు మహ్మద్ అలీఖాన్‌బాబర్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బాదెపల్లి సిద్ధార్థ, భార్గవ్‌కుమార్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, అందె మోహన్, అందె శ్రీకాంత్, సయ్యద్‌ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## నా గెలుపు బాధ్యత మీదే

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**కొడంగల్:** నా గెలుపు బాధ్యత మీదే.. ఈ ఎన్నికల్లో కొడంగల్ సత్తా ఏంటో చూపించండి అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ తరఫున కొడంగల్‌లో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కేటీఆర్ దత్తత పేరుతో కొడంగల్‌కు మోసం చేశారని, కృష్ణా రైల్వే లైన్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో జూనియర్ కళాశాలలు, కృష్ణా జలాలు తెచ్చి ఇక్కడి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ సన్నాసులు ఇవాళ ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఈ ఎన్నికలు ఆషామాషీ ఎన్నికలు కావని, ఇక్కడి ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చే ఎన్నికలన్నారు. దేశ ముఖ చిత్రంలో కొడంగల్‌కు గుర్తింపు తెచ్చే ఎన్నికలన్నారు. గెలిచిన రెండేళ్లలో నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పూర్తి చేసి నీళ్లు తెస్తానని హామీ ఇచ్చారు. ఏడాదిలో మహబూబ్‌నగర్ నుంచి చించోళి జాతీయ రహదారి పూర్తి చేస్తానని, ఆడ బిడ్డలకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలను తెస్తానని, అండగా నిలబడే ప్రజల ఆత్మ గౌరవం నిలబెట్టే బాధ్యత తనదేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అదే ఉత్కంఠ

- చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థికి దక్కని బీఫాం
- కొనసాగుతున్న నిరీక్షణ
- నేడు స్పష్టత వచ్చే అవకాశం



పామెన భీంభరత్

**చేవెళ్ల:** చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ బీఫాం విషయంలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. సోమవారం రాత్రి వరకు గాంధీభవన్ వద్ద వేచి ఉన్నా స్పష్టత రాకపోవడంతో పామెన భీంభరత్, నియోజకవర్గం నాయకులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇంటికి అభ్యర్థి పామెన భీంభరత్, నియోజకవర్గం నాయకులు వెళ్లారు. టికెట్‌ను అధిష్టానం మొదటి జాబితాలోనే ప్రకటించింది. బీఫాం ఇచ్చే సమయంలో అభ్యర్థిపై ఆశావహులు ఫిర్యాదు చేయటంతో ఆయనకు బీఫాం ఇచ్చే విషయంలో పార్టీ పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అభ్యర్థిని మార్చే అవకాశం ఉందని.. గతంలో టికెట్ ఆశించిన షాబాద్ దర్శన్, రాచమొళ్ల సిద్దేశ్వర్‌కు లేదా పార్టీ పెద్దలు మల్లు రవి లాంటి వారు వచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.

**ఉదయం నుంచి గాంధీభవన్ వద్దే నిరీక్షణ**

సోమవారం ఉదయం బీఫాం వస్తుందనే ఉదయం నుంచి పామెన భీంభరత్ గాంధీభవన్ వద్ద తన అనుచరులతో నియోజకవర్గం పార్టీ నాయకులతో వేచి ఉన్నారు. ఏమీ చెప్పకపోవటంతో సాయంత్రం వరకు చూశారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో నామినేషన్‌కు వెళ్లారని ఆయన వచ్చిన తరువాత బీఫాం విషయం మాట్లాడాలని వేచి చూశారు. ఆయన రాత్రి వరకు రాకపోవడంతో రాత్రి 7 గంటలకు ఆయన ఇంటికి వస్తున్నారని తెలియటంతో గాంధీభవన్ నుంచి రేవంత్‌రెడ్డి ఇంటికి బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయన సమయం ఇచ్చి బీఫాం విషయంలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

**ఢిల్లీ పెద్దల ఆశీస్సులతోనే ..**

ఢిల్లీ పెద్దల ఆశీస్సులతో పామెన భీంభరత్‌కు టికెట్ రావటంతోనే రాష్ట్ర నేతలు సంకోచిస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే భీంభరత్ వర్గం కూడా ఢిల్లీపెద్దలతో సంప్రదింపులు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. టికెట్ తెచ్చుకున్నట్లుగానే బీఫాం కూడా తెచ్చుకుంటారని చర్చించుకుంటున్నారు.

**ఆందోళన వద్దు**

టికెట్ తనకే ఇచ్చారని.. బీఫాం కూడా తనకే వస్తోందని భీంభరత్ రాత్రి గాంధీ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం బీఫాం ఇస్తామని చెప్పారన్నారు. పార్టీ శ్రేణులు ఆందోళన చెందాల్సిన పని లేదని.. విజయం కాంగ్రెస్ పార్టీదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**మూడో జాబితాలో మార్పు లేకపోవడంతో..**

తాజాగా సోమవారం ప్రకటించిన మూడో జాబితాలో బోథ్, వనపర్తి స్థానాలకు రెండో జాబితాలో ప్రకటించిన అభ్యర్థులను అధిష్టానం మార్పు చేసింది. చేవెళ్ల నుంచి అలాంటిదేమీ లేకపోవడంతో బీఫాం తప్పనిసరి భీంభరత్‌కే వస్తుందని ఆయన వర్గీయులు నమ్మకంగా ఉన్నారు.

# యూత్ ఫస్ట్!

- నవయువ ఓటర్లకు ప్రత్యేక కేంద్రాలు
- స్పెషల్ థీమాటిక్ పోలింగ్ స్టేషన్లకు శ్రీకారం
- హైదరాబాద్ జిల్లాలో 15 ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా ఓటు హక్కు పొందిన నవ యువతలో ఎక్కువమంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు.. ఉత్సాహంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నారు. కొత్త ఓటరుగా నమోదైన వారికి ఉచితంగానే ఎపిక్ కార్డుల్ని వారి ఇళ్లకే పంపిస్తున్న అధికారులు..వారిలో ఎక్కువమంది ఓటు వేసేలా ప్రోత్సహించేందుకు ఈ కేంద్రాల్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. వీటిని 'స్పెషల్ థీమాటిక్ పోలింగ్ స్టేషన్లు'గా పిలుస్తున్నారు. 18–19 ఏళ్ల మధ్య వయసు వారి కోసం వీటిని ఏర్పాటు చేస్తారు.

- తొలిసారి ఓటు హక్కు పొందిన యువత పోలింగ్ కేంద్రానికి వెళ్లగానే గందరగోళానికి గురి కాకుండా సాదరంగా ఆహ్వానం పలికేలా రిసెప్షన్ వంటి ఏర్పాట్లు చేయనున్నారు.
- క్యూలో తొలుత ఎవరి వద్దకు వెళ్లాలి, ఓటు ఎలా వేయాలి వంటి వివరాలనే రిసెప్షన్‌లోనే ఓటరుకు వివరిస్తారు.
- ఈ కేంద్రం వద్ద యూత్‌ను ఆకర్షించేలా బ్యానర్లు, పోస్టర్లు, ప్రత్యేక అలంకరణలు చేస్తారు.
- ఈ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు తగిన సెంటర్లను గుర్తించారు.



# 'పట్నం'లో టైట్ ఫైట్

విప్లవాల పురిటిగడ్డ.. కమ్యూనిస్టుల కంచుకోట.. రాచకొండ గుట్టలు నిలయంగా సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటం.. నియోజకవర్గ సొంతం. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానికి ముందుగానే ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్‌గా ఉండేది. అంతటి చరిత్ర కలిగిన ఈ గడ్డపై ప్రధాన పార్టీలన్నీ తమ జెండాలు ఎగురవేశాయి.

- ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవానికి ముందే అసెంబ్లీ సెగ్మెంట్
- 11 మంది ఎమ్మెల్యేల్లో మంత్రులుగా ఇద్దరికే అవకాశం
- హ్యాట్రిక్ విజయాలు దక్కించుకున్న లక్ష్మీనర్సయ్య, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ప్రస్తుత ఎన్నికల బరిలో బలమైన నేతలు
- నలభై ఏళ్ల కల సాకారం కోసం కాంగ్రెస్
- పట్టు కోసం బీఆర్‌ఎస్

జంగ్ తెలంగాణ

ఇబ్రహీంపట్నం: నగరానికి ఆనుకుని ఉన్న ఈ నియోజకవర్గంలో అన్ని పార్టీలు కాలానుగుణంగా తమ ప్రాబల్యాన్ని చాటాయి. ఈ సెగ్మెంట్ హస్తం చేజారి రనాలుగు దశబ్దాలు కావొస్తుండగా.. టీడీపీ, సీపీఎంలు మూడు దశాబ్దాలుగా విజయం సాధిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం 'కారు' 2018లో బోణీ కొట్టింది. 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో ఈ నియోజకవర్గం ఉండేది. ఇప్పటి వరకు 16సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, మూడు సార్లు సీపీఎం, ఒకసారి టీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. 1978 నుంచి 2004 వరకు ఈ స్థానం ఎస్సీ రిజర్వ్‌. ఇక్కడ ప్రాతినిధ్యం వహించిన 11మందిలో కేవలం ఇద్దరికి మాత్రమే అమాత్య పదవి వరించింది. 15ఏళ్ల పాటు సీపీఎం ఎమ్మెల్యేలు ఈ నియోజకవర్గాన్ని శాసించారు. రోజురోజుకు కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గుతుంది. కాంగ్రెస్, టీడీపీల పొత్తుల ప్రభావం కారణంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం మసకబారింది.

### 1952లో ద్విసభ్య శాసనసభ్యులు

1952లో జరిగిన ఈ ఎన్నికల్లో ద్విసభ్య శాసనసభ నియోజకవర్గంగా ఉండేది. తూర్పు, పడమటి ప్రాంతాల నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించేవారు. అప్పట్లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండటంతో 1952 అసెంబ్లీ ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి పిల్లయిపల్లి పాపిరెడ్డి (తూర్పు భాగం), కాంగ్రెస్ నుంచి ఎంబీ గౌతమ్ పడమటి బాగం(ఇబ్రహీంపట్నం ప్రాంతం) నుంచి ఎమ్మెల్యేలుగా పని చేశారు.1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించిన అనంతరం ఏకసభ్య నియోజకవర్గంగా మారింది.



కొండిగారి రాములు
మాజీ ఎమ్మెల్యే

### ఇద్దరు అభ్యర్థులను వరించిన హ్యాట్రిక్

1952 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎంబీ గౌతమ్, పీడీఎఫ్ నుంచి పిలాయిపల్లి పాపిరెడ్డి, 1957, 1962, 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన లక్ష్మీనర్సయ్య హ్యాట్రిక్ విజయం సాధించారు. 1972 ఎన్నికల్లో హస్తంపై అనంతరెడ్డి గెలుపొందింది. 1978 నుంచి ఎస్సీ రిజర్వ్డ్ స్థానంగా మారింది.

## నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు

| సంవత్సరం | ఎమ్మెల్యే | పార్టీ |
|---|---|---|
| 1952 | ఎంజి గౌతమ్ | కాంగ్రెస్ |
| - | పిలాయిపల్లి పాపిరెడ్డి | పీడీఎఫ్ |
| 1957 | ఎంఎన్.లక్ష్మీనర్సయ్య | కాంగ్రెస్ |
| 1962 | ఎంఎన్.లక్ష్మీనర్సయ్య | కాంగ్రెస్ |
| 1967 | ఎంఎన్.లక్ష్మీనర్సయ్య | కాంగ్రెస్ |
| 1972 | ఎన్. అనంతరెడ్డి | కాంగ్రెస్ |
| 1978 | సుమిత్రాదేవి | కాంగ్రెస్ |
| 1981 | ఏజీ కృష్ణ(ఉప ఎన్నిక) | కాంగ్రెస్ |
| 1983 | ఏజీ కృష్ణ | కాంగ్రెస్ |
| 1985 | కె.సత్యనారాయణ | టీడీపీ |
| 1989 | కొండిగారి రాములు | సీపీఎం |
| 1994 | కొండిగారి రాములు | సీపీఎం |
| 1999 | కొండ్రు పుష్పలీల | టీడీపీ |
| 2004 | మస్కు నర్సింహా | సీపీఎం |
| 2009 | మంచిరెడ్డి కిషన్‌రెడ్డి | టీడీపీ |
| 2014 | మంచిరెడ్డి కిషన్‌రెడ్డి | టీడీపీ |
| 2018 | మంచిరెడ్డి కిషన్‌రెడ్డి | టీఆర్‌ఎస్ |

## మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

| మండలాలు | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 76 | 34,972 | 34853 | 4 | 69,829 |
| యాచారం | 59 | 23,586 | 22,854 | 0 | 46,440 |
| మంచాల | 45 | 19,787 | 18,773 | 1 | 38,561 |
| అబ్దుల్లాపూర్‌మెట్ | 139 | 79,395 | 76,437 | 24 | 1,55,856 |
| మొత్తం | 319 | 1,57,740 | 1,52,917 | 29 | 3,10,686 |



ఇబ్రహీంపట్నం టౌన్ ముఖచిత్రం



మస్కు నర్సింహా, మాజీ ఎమ్మెల్యే



కొండ్రు పుష్పలీల, మాజీ మంత్రి




కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే



కె. సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే

ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సుమిత్రదేవి అసెంబ్లీ మెట్లెక్కారు. ఆమె మృతి చెందడంతో 1981లో నిర్వహించిన ఉప ఎన్నిక, 1983 సాధారణ ఎన్నికల్లో ఏజీ కృష్ణ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ప్రభంజనం వీస్తున్న తరుణంలో 1982లో కాంగ్రెస్ జెండా ఎగరడ గమనార్హం. అనంతరం నియోజవర్గ రాజకీయాల్లో మార్పు వచ్చింది. 1985లో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ మధ్యంతర ఎన్నికలకు వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఏ అసెంబ్లీ ఎన్నికలోనూ కాంగ్రెస్ ఈ స్థానాన్ని దక్కించుకోలేకపోయింది. 1985 ఎన్నికల్లో కె.సత్యనారాయణ టీడీపీ నుంచి గెలుపొందారు. 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షంగా ఉన్న సీపీఎం నుంచి కొండిగారి రాములు, 1999లో సైకిల్‌పై కొండ్రు పుష్పలీల, 2004లో కాంగ్రెస్ మిత్రపక్షంగా ఉన్న సీపీఎం నుంచి మస్కు నర్సింహ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2009, 2014 ఎన్నికల్లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి టీడీపీ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన సైకిల్ దిగి కారెక్కారు. 2018లో టీఆర్‌ఎస్ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించారు. డీలిమిటేషన్‌లో మహేశ్వరం, కందుకూరు మండలాల స్థానంలో హయత్‌నగర్ (అబ్దుల్లాపూర్‌మెట్)



మండలం ఇందులో కలిసింది. దీంతో 2009 నుంచి మళ్లీ జనరల్ స్థానంగా మారింది. నియోజకవర్గంలో ఇద్దరు మహిళలు సుమిత్రాదేవి, పుష్పలీల ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు.

### ఇద్దరు మంత్రులు

నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేల్లో ఇద్దరికి మంత్రులు పదువులు వచ్చాయి. కాంగ్రెస్ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన లక్ష్మీనర్సయ్య, టీడీపీ నుంచి ఒకసారి గెలిచిన కొండ్రు పుష్పలీల మంత్రులుగా పని చేశారు.

### హస్తంలో గ్రూపు రాజకీయాలు

1985 నుంచి కాంగ్రెస్ అపజాయానికి కారణం గ్రూపు రాజకీయాలే. సెగ్మెంట్‌లో బలమైన పార్టీ కేడర్ ఉన్నా నాయకుల మధ్య సఖ్యత లేక పార్టీ గెలుపునకు అడ్డుకట్ట వేస్తున్నాయి.

### 'కమలం' తహ తహ

నియోజవకర్గంలో పట్టు సాధించేందుకు బీజేపీ ఏళ్ల నుంచి తహ తహలాడుతోంది. ప్రజల్లో పట్టున్న నాయకుడు ఈ నియోజకవర్గంలో లేకపోవడం ఆ పార్టీకి సమస్యగా మారింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికీ పార్టీకి కేడర్ లేకపోవడం గమనార్హం.

### ద్విముఖ పోరు

'పట్నం'లో మరోమారు కారు జోరు చూపించాలని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రచారం ముమ్మరం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కక మల్‌రెడ్డి రపనుగు గుర్తుపై పోటీ కేవలం 356 ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశారు. దీంతో ఈ ఎన్నికలు మంచిరెడ్డి, మల్‌రెడ్డి మధ్య హోరాహోరి పోరు జరుగనున్నదని విశ్లేషకులు అంటున్నారు.



# సబిత.. మంత్రిగా ఘనత!

అమాత్య పదవుల్లో సరికొత్త రికార్డు



హుడాకాంప్లెక్స్: చేవెళ్ల చెల్లెమ్మగా.. తొలి మహిళా హోం మంత్రిగా... గెలిచిన ప్రతీసారి మంత్రి పదవి చేపట్టి ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ ప్రత్యేకంగా నిలిచారు. ప్రస్తుతం ఆమె మహేశ్వరం సిట్టింగ్ ఎమ్మెల్యే.. విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి. భర్త మరణంతో అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె దివంగత సీఎం వైఎస్సార్ ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణిస్తూ తనదైన ముద్ర వేసుకుంటున్నారు.

- ఉమ్మడి రాష్ట్రంలో 1999లో సబితారెడ్డి భర్త పి.ఇంద్రారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి కేఎల్‌ఆర్‌పై విజయం సాధించారు. 2000లో ఆయన అకాల మరణంతో ఆమె అనూహ్యంగా రాజకీయ అరంగేట్రం చేశారు. ఉప ఎన్నికతో ప్రస్తావాన్ని ప్రారంభించిన ఆమె కేఎల్‌ఆర్‌ను ఓడించి అసెంబ్లీలో అగుడుపెట్టింది.
- 2004లోనూ పోటీలో నిలిచిన ఆమె టీడీపీ అభ్యర్థి ఎస్.భూపల్‌రెడ్డిపై విజయం సాధించారు. అనంతరం ఆమె మంత్రి వర్గంలో చోటు దక్కించుకుని గనుల శాఖ మంత్రిగా మెప్పించారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నుంచి సబితారెడ్డి మూడోసారి బరిలో నిలిచారు. ఈ ఎన్నికలో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగి టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డిపై ఘన విజయం సాధించారు. దీంతో వైఎస్‌ఆర్ ప్రోత్సహించి ఆమెకు హోంమంత్రి పదవిని కట్టబెట్టడంతో తొలి మహిళా హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. అనంతరం 2014 ఎన్నికలకు ఆమె దూరంగా ఉన్నారు.
- 2018 ఎన్నికల్లో మరోసారి మహేశ్వరం నుంచి పోటీ చేసిన సబితారెడ్డి విజయం సాధించారు. అనంతరం ఆమె గులాబీ తీర్థం పుచ్చుకుని సీఎం కేసీఆర్ మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. రాష్ట్రంలో తొలి మహిళా మంత్రిగా రికార్డుల నెలకొలిపారు. 2023 ఎన్నికల్లో ఆమె కారుగుర్తుపై ఎన్నికల పోటీలో ఉన్నారు.

# కాలం చెల్లిన కారు.. రూ.60వేల నగదు

**వారసత్వ ఆస్తులు రూ.30కోట్లు**

- సతీమణి పేరిట రూ.15.40కోట్లు
- ఎన్నికల అఫడవిట్‌లో పేర్కొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి

**అప్పులు**

భార్య ముకుంద పేరిట రూ.40,21,114 విలువైన వోల్వోకారుపై రుణం తీసుకోగా రూ.22 లక్షలు బకాయి చెల్లించాల్సివుంది. కాగా దివ్యాంగుడైన ఒక కుమారుడు తనపై ఆధారపడి ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నం: తనపై రూ.42కోట్లకు పైగా ఆస్తులున్నాయని, క్రిమినల్ కేసులు లేవని ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.2లక్షల విలువచేసే కాలంచెల్లిన హోండా సిటీ కారు, చేతిలో రూ.60వేల నగదు, ఐదుతులాల బంగారం, రూ.20లక్షల విలువైన ఎల్‌ఐసీ పాలసీలున్నట్లు పేర్కొన్నారు.

**స్థిరాస్తులు**

ఎలిమినేడులో 21.7ఎకరాలు, తిమ్మాపూర్ 8.18 ఎకరాల వారసత్వ భూమితోపాటుగా, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం ముంగిలో 18.24ఎకరాలు, నార్సింగ్‌లో 1.20ఎకరాలు కొనుగోలు చేసిన భూములున్నాయి. మొత్తం రూ.40కోట్ల విలువైన 48.9 ఎకరాల భూమి మంచిరెడ్డి పేరు పై ఉంది. 2018 ఎన్నికల అఫడవిట్‌లో 58.22 ఎకరాలున్నట్లు పేర్కొనగా ఇప్పుడు తగ్గింది.

**నివాస గృహాలు**

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిపై మలక్‌పేట్ తిరుమల హిల్స్‌లో రూ.కోటి విలువ చేసే 220 గజాల ఇల్లు, నార్సింగ్‌లో ఉన్న అపార్టుమెంట్‌లో రూ.1.30కోట్ల విలువ చేసే ఫోర్ బెడ్రూం ఫ్లాట్, ఎలిమినేడులో ఒక నివాస గృహం ఉన్నట్లు చూపారు.

**సతీమణి ముకుంద పేరిట**

మంచిరెడ్డి కిషన్ రెడ్డి సతీమణి ముకుందపై తిరుమల హిల్స్‌లో 320 గజాల ఇల్లు, గచ్చిబౌలి, నార్సింగ్ ఏరియాల్లోని అపార్టుమెంట్‌లల్లో ఒక్కొక్క ఫ్లాట్, ఎల్మినేడులో మరో ఇల్లు.. వీటి మొత్తం విలువ 1.25 కోట్లుగా పేర్కొన్నారు. రూ.12కోట్ల విలువ చేసే 17.5 ఎకరాల వ్యవసాయ భూమిని చూపారు.

**చరాస్తులు**

ముకుందమ్మ చేతిలో రూ.40 వేల నగదు, రూ.1.20కోట్ల విలువ చేసే వోల్వో కారు, కిలో బంగారం, 3కిలోల వెండి, రెండు అకౌంట్లలో రూ.13,26,320 నగదు, పది లక్షల విలువ చేసే ఎల్‌ఐసీ పాలసీలున్నట్లు పేర్కొన్నారు.

## బీసీలను మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

తొలగించబడిన 26 కులాల పోరాట సమితి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని బీసీల హక్కులను కాలరాసి, వారిని దగా చేసిన బీఆర్‌ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని తెలంగాణ రాష్ట్ర తొలగించబడిన 26 కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నిజాం పాలనా కాలం నుంచి రాష్ట్రంలో కొన్ని అణగారిన బీసీ కులాలు జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తరతరాలుగా తెలంగాణలో నివసిస్తున్న ఆంధ్ర ప్రాంతానికి చెందిన అత్యంత వెనుకబడిన 26 బీసీ కులాలను ముఖ్యమంత్రి కేసీఆర్ వివక్షపూరితంగా బీసీ కుల జాబితా నుండి తొలగించి అన్యాయం చేశారని ఆరోపించారు. తొలగించిన 26 బీసీ కులాల ప్రజలు గత పదేళ్లగా విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్ట పోయారన్నారు. బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తాము అధికారం లోకి వచ్చిన వెంటనే తిరిగి జాబితాలో చేరుస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడమేగా మేనిఫెస్టోలో పొందుపరిస్తేనే ఆ పార్టీలకు ఓటు వేసి గెలిపిస్తామన్నారు. 26 కులాలను తిరిగి బీసీ జాబితాలో చేరుస్తామని ఇప్పటికే పలువురు నేతలు ప్రకటించారన్నారు. జనాభా లెక్కల్లో కులగణన చేస్తామని హామీ ఇచ్చిన పార్టీని ప్రతి నియోజకవర్గంలో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బొల్లంగి ప్రసాద్, ఎం.ఆర్.కె.రెడ్డి, జాయింట్ సెక్రటరీ చిత్తూరి వేణు, కార్యవర్గ సభ్యులు ఎస్.వెంకటేశ్వర్ రావు, మురళిధర్, కె.రామకృష్ణ, జల్లు హేమసుందర్ రావు, కె.వెంకట్ నాయుడు, టి.శ్రీనివాస్ రావు, జి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీ

కూకట్‌పల్లి: కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పర దాడులకు పాల్పడిన సంఘటన సోమవారం కూకట్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్ ప్రసంగిస్తుండగా, అదే సమయంలో భోజనాల వద్ద బాలాజీనగర్, బోయినపల్లి డివిజన్ కార్యకర్తల మధ్య లైన్‌లో నిలుచునే విషయమై గొడవ చోటు చేసుకుంది. దీంతో వారు పరస్పర దాడులకు దిగడంతో కొందరికి గాయాలయ్యాయి.